## ఐదవ పాఠం — الدرس الخامس

## కలిమయే తౌహీద్ భావం — معنى كلمة التوحيد

**'లాఇలాహ ఇల్లల్లాహ్'** ఇస్లాం యొక్క పునాది. ఇస్లాంలో దీని స్థానం చాలా గొప్పది. ఇది ఇస్లాం స్తంభాలలో మొదటిది. విశ్వాస భాగాలలో ఉన్నతమైనది. ఈ వచనాన్ని హృదయపూర్వకంగా పఠించి, దీని అర్థభావాన్ని తెలుసుకొని, దీని ప్రకారం ఆచరించడంపైనే సత్కార్యాల అంగీకారం ఆధారపడి ఉంది. (దీనినే కలిమయే తౌహీద్ అంటారు).

దీని వాస్తవ భావం: **"ఆరాధనకు నిజమైన అర్హుడు అల్లాహ్ తప్ప మరెవడూ లేడు".** అంటే అద్వితీయుడు, ఏకైకుడైన అల్లాహ్ నే ఆరాధించాలి, ఇతరుల ఆరాధన వదులుకోవాలి. ఇది కాక 'అల్లాహ్ తప్ప సృష్టికర్త ఎవడు లేడు', 'అల్లాహ్ తప్ప శూన్యము నుండి ఉనికిలోకి తెచ్చే శక్తి గలవాడెవడు లేడు'. 'విశ్వంలో అల్లాహ్ తప్ప మరేమి లేదు' అనే భావాలు (**'లాఇలాహ ఇల్లల్లాహ్'** యొక్క అర్థం) కావు.

**ఇందులో రెండు 'రుకున్లు' (మౌలికవిషయాలు) ఉన్నాయి:**

(1) **తిరస్కరించుట**: ఇది 'లాఇలాహ' అన్న పదంలో ఉంది. అనగా ఉలూహియ్యత్ (ఈశ్వరత్వం)ని ప్రతి వస్తువు నుండి తిరస్కరించుట. అంటే ఆరాధనకు నిజమైన అర్హుడు ఎవ్వడూ లేడని నమ్ముట.

(2) **అంగీకరించుట**: ఇది 'ఇల్లల్లాహ్' అన్న పదంలో ఉంది. అనగా ఉలూహియ్యత్ (ఆరాధనల)కు అర్హతగల అద్వితీయుడు అల్లాహ్ మాత్రమేనని, ఆయనకు భాగస్వాముడెవడూ లేడని నమ్ముట.

అందుకే అల్లాహ్ ను వదలి ఇతరులను ఆరాధించడం సరియైనది కాదు. అలాగే ఆరాధనలోని ఏ ఒక్క భాగాన్ని కూడా అల్లాహ్ తప్ప ఇతరులకు చేయుట యోగ్యం లేదు.

ఏ వ్యక్తి ఈ వాస్తవ భావాన్ని తెలుసుకొని **'లాఇలాహ ఇల్లల్లాహ్'** పఠిస్తాడో, దాని ప్రకారం ఆచరిస్తాడో, బహుదైవారాధనను తిరస్కరించి, అల్లాహ్ ఏకత్వమును దృఢ నమ్మకంతో విశ్వసిస్తాడో అతడే వాస్తవ ముస్లిం (విధేయుడు).

ఇలాంటి దృఢమైన విశ్వాసం మరియు దాని బాధ్యతలను గ్రహించకనే ఆచరించువాడు మునాఫిఖ్ (కపటవిశ్వాసి). దీనికి వ్యతిరేకంగా షిర్క్ పై ఉన్నవాడు, దానిని నోటితో పలికినా ముష్రిక్, కాఫిర్ అవుతాడు.

## కలిమయే తౌహీద్ ఘనత — فضل كلمة التوحيد

ఈ సద్వచన ఘనతలు, లాభాలు చాలా ఉన్నాయి. వాటిలో కొన్ని ఇవి:

1- తౌహీద్ గల వ్యక్తి నరక శిక్షకు గురి అయినా, అతను అందులో శాశ్వతంగా ఉండకుండా **'లాఇలాహ ఇల్లల్లాహ్'** అడ్డుపడుతుంది. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారు: **'లాఇలాహ ఇల్లల్లాహ్' పఠించిన వ్యక్తి హృదయంలో జొన్న గింజంత విశ్వాసమున్నా నరకం నుండి వెలికి వస్తాడు. 'లాఇలాహ ఇల్లల్లాహ్' చదివిన వ్యక్తి హృదయంలో గోదుమ గింజంత విశ్వాసమున్నా నరకం నుండి వెలికి వస్తాడు. అలాగే ఎవరు 'లాఇలాహ ఇల్లల్లాహ్' చదివాడో అతని మనుస్సులో ఇసుమంత / రవ్వంత విశ్వాసమున్నా అతనూ నరకం నుండి వెలికి వస్తాడు". (బుఖారి 44, ముస్లిం 193).**

2- అల్లాహ్ మానవులను, జిన్నాతులను **'లాఇలాహ ఇల్లల్లాహ్'** కొరకే పుట్టించాడు. అల్లాహ్ ఇలా తెలిపాడు: **{నేను మానవులను జిన్నాతులను కేవలం నన్ను ఆరాధించుటకే సృష్టించాను}. (సూరె జారియాత్ 51: 56)**

ఈ ఆయతులో 'యఅ్‌బుదూన్' అన్న పదానికి అర్థం: ఆరాధించుట అంటే ఆరాధనలో అల్లాహ్ ఏకత్వాన్ని పాటించుట.

3- అల్లాహ్ ప్రవక్తలను పంపినది, గ్రంథాలను అవతరింపజేసినది దీని ప్రచారం కొరకే. అల్లాహ్ ఆదేశం పై శ్రద్ధ వహించండి: **{మేము నీకు పూర్వం ఏ ప్రవక్తను పంపినా, అతనికి వహీ ద్వారా 'నేను తప్ప వేరు నిజ ఆరాధ్యుడు మరొకడు లేడు, కనుక మీరు నన్ను మాత్రమే ఆరాధించండి' అనే విషయాన్ని తెలియజేశాము}. (అంబియా 21: 25).**

4- ప్రవక్తల ప్రచార ఆరంభం ఇదే (**'లాఇలాహ ఇల్లల్లాహ్'**). ప్రతి ప్రవక్త తమ జాతి వారికి ఇదే పిలుపునిచ్చాడు. చదవండి అల్లాహ్ ఆదేశం: **{నా జాతి ప్రజలారా! మీరు అల్లాహ్ నే ఆరాధించండి. ఆయన తప్ప వేరే నిజ ఆరాధ్యుడు మీకు లేడు}. (సూరె ఆరాఫ్ 7: 73).**